క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలి



ఎన్.హనుమాపురంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కణేకల్లు: ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎన్.హనుమాపురంలో సీజనల్ వ్యాధులపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దోమ లార్వా పెరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలు, వస్తువులను గుర్తించి, తొలగించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రేణుక, హెల్త్ అసిస్టెంట్ సంపత్, ఎంఎల్‌హెచ్‌పీ విష్ణు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో కండ్లకలక

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లిలో కండ్లకలక కలవర పెడుతోంది. దీంతో గ్రామంలో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. 20 మందికిపైగా కండ్లకలక సోకింది. గ్రామంలో అనేక మంది ఈ వ్యాధిన బారిన పడుతున్నారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా బిందె పూజ



బూదగవి మారెమ్మ అమ్మవారికి పవిత్ర గంగా జలాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

ఉరవకొండ: మండలంలోని బూదగవిలో అనంతపురం– బళ్లారి 42వ జాతీయ రహదారి పక్కన వెలసిన గౌరసంద్రం మారెమ్మ ఆలయంలో జలధి బిందెపూజ 55వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాము, అర్చకులు దేవరాజ్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉరవకొండలో పెన్నానది నుంచి తీసుకొచ్చి పవిత్ర గంగా జలాన్ని ఉరవకొండతో ఊరేగించారు. గంగా జలంతో అమ్మవారికి అభిషేకం చేశారు. ఈనెల 9 వరకు అమ్మవారి ఉత్సవాలు కొనసాగనున్నాయి.

బాధ్యతగా పని చేయాలి



మాట్లాడుతున్న ఏసీ నారాయణ స్వామి

బ్రహ్మసముద్రం :యానిమేట్లు బాధ్యతగా పని చేయాలని ఏరియా కోఆర్డినేటర్ నారాయణ స్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఓ లీలామణి ఆధ్వర్యంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల యానిమేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో యానిమేటర్లు మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని , బ్యాంకుల ద్వారా రుణాలు సక్రమంగా చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. వెలుగు కార్యాలయ సిబ్బంది, యానిమేటర్లు , మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బెల్లంతో జంబుకేశ్వరుడి అలంకరణ



రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు జరిగాయి. బెల్లంతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అర్చకులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు స్వామికి పూజలు, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమ అర్చన, మంగళనైవేద్యాలు చేపట్టారు.

కమ్యూనిటీ భవనాల కోసం స్థలం చూపించండి

విడపనకల్లు: విడపనకల్లు, ఉరవకొండ మండలాల్లో ఎస్సీ కమ్యూనిటీ భవనాల నిర్మించుకోవడానికి స్థలాలు చూపించాలని ఎస్సీ,ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యుడు నెరిమెట్ల యల్లప్ప ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం విన్నవించారు. కార్యక్రమంలో బళ్లారి ఎర్రిస్వామి, మోపిడి వన్నూరుస్వామి, రమేష్, గోవిందమ్మ పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

వజ్రకరూరు: మండలంలోని గంజికుంటకు చెందిన అంకమ్మ అనే మహిళకు సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. అంకమ్మ వజ్రకరూరులోని ప్రధాన రహదారి దాటుతుండగా, గుంతకల్లు నుంచి ఉరవకొండ వైపు వెళ్తున్న కారు ఢీకొనింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను అనంతపురం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అంకమ్మ కుమారుడు విష్ణు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సుఖీభవ..ప్రకటనకే పరిమితం

- అన్నదాతల ఆశలు ఆవిరి
- రైతులపై కూటమి సర్కారు చిన్నచూపు
- ఖరీఫ్ ముగిసే సమయం వచ్చినా రైతుకు దక్కని భరోసా
- జగన్ ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తో పాటే రైతు భరోసా సొమ్ము జమ





ఖరీఫ్ సీజన్ ముగిసినా పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. గత ఐదేళ్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే (మేనెల) తొలివిడతగా పీఎం కిసాన్– రైతు భరోసా పథకం పేరిట రూ.7500 నగదు జమ చేసి, అన్నదాతలను ఆదుకుంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు రైతు భరోసా పథకం ద్వారా ఇచ్చే రూ.13,500 మొత్తాన్ని అన్నదాత సుఖీభవగా పేరు మార్చి ఏటా రూ.20 వేలచొప్పున పెట్టుబడి సాయంగా ఇస్తామని, ఊరూవాడా ఊదరగొట్టారు. ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు పూర్తయినా 'అన్నదాత సుఖీభవ' పథకం ఊసెత్తని పరిస్థితి. పెట్టుబడి సాయం కాస్త ఎదురుచూపునకే పరిమితమైంది. పంటల సాగుకోసం రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి.

– రాయదుర్గం:

నాడు రూ.958.04 కోట్లు రైతు ఖాతాల్లో జమ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని (2019–2024) వరకు పీఎం కిసాన్ – వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా 7,35,353 లక్షల మంది రైతులకు రూ.958.04 కోట్లు ఖాతాల్లో జమ అయ్యింది. ఈ సాయం రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరింది. పెట్టుబడి కోసం ఎవరి వద్ద చెయ్యి చాచే పనిలేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం రెండు విడతల్లో సాయం చేసినా రాష్ట్ర ప్రభుత్వం పిసరంతైనా అందించలేదు. రెండు రోజుల క్రితం పీఎం–కిసాన్ ద్వారా మూడు నియోజకవర్గాల్లోనూ 1,43,655 మంది రైతు ఖాతాల్లో రూ.28.07 కోట్లు జమ అయ్యింది. ఈ మొత్తం చూసి అన్నదాతపై కూటమి సర్కారు చిన్నచూపు చూస్తోందని రైతులు మండిపడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన రైతు భరోసా సాయం

(2019 నుంచి 2024 వరకు)

నియోజకవర్గం	రైతులు	సాయం (రూ.కోట్లలో)
రాయదుర్గం	2,17,424	రూ.283.55
కళ్యాణదుర్గం	2,66,787	రూ.347.41
ఉరవకొండ	2,51,142	రూ.327.08
మొత్తం	7,35,353	రూ.958.04

పెట్టుబడి సాయం అందలేదు



గతంలో ఖరీఫ్, రబీ సాగుకు ముందే రైతు భరోసా పథకం ద్వారా రెండు విడతల్లో రూ.11,500 జమ చేసేవారు. జనవరిలో పంట చేతికొచ్చేసరికి మరో రూ.2 వేలు కలిపితే మొత్తం రూ.13,500 ఖాతాల్లోకి డబ్బు జమ అయ్యేది. ఈ ఏడాది ఇప్పటి వరకూ పైసా సాయం అందలేదు. పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వచ్చింది.

– గొల్ల నాగరాజు, రైతు, కేపీదొడ్డి

రైతులను ఆదుకోవాలి



కష్టాల్లో ఉండే రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. గత ప్రభుత్వం లో వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దాన్ని రూ.20 వేలకు పెంచి ఇస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఊసెత్తలేదు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద వడ్డీలకు తెచ్చుకోవాల్సి వస్తోంది.

– హనుమంతరెడ్డి, రైతు, పూలకుంట

కూటమి ప్రభుత్వం విఫలం



కూటమి సర్కారు రైతులను ఆదుకోవడంలో ఘోరంగా విఫలమైంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి సాయం ఎప్పుడిస్తారో చెప్పాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మేరకు క్రమం తప్పకుండా ఐదేళ్ల పాటు రూ.13,500 సాయం అందించారు. పెట్టుబడికి ఢోకా లేకుండా రైతుకు దన్నుగా నిలిచారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు ఇస్తామని కూటమి నేతలు ప్రచార సమయంలో రైతులకు మాట ఇచ్చారు. ఖరీఫ్ ముగిసినా పైసా జమ చేయకపోవడం దుర్మార్గం.

– గౌని ఉపేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయదుర్గం

పెట్టుబడి సాయం ఇవ్వలేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకూ రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఖరీఫ్ ముగింపుదశకొచ్చినా సాయం అందించలేదు. రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– రవీంద్ర, ఎన్.హనుమాపురం

వైభవంగా దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు

ఉరవకొండ: స్థానిక గుంతకల్లు రోడ్డులోని ప్రసిద్ధిగాంచిన జగదీశ్వరి ఆలయంలో దేవీశరన్నవరాత్రుల ఉత్స వాల్లో భాగంగా సోమవారం అమ్మవారు మహా చండీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త గాజుల శ్యామల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సిండికేట్ బ్యాంకు వద్ద ఉన్న ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాచండీదేవిగా దర్శనిమిచ్చారు.

ధనలక్ష్మిదేవి అలంకరణలో వాసవీమాత

బెళుగుప్ప: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత ధనలక్ష్మిదేవి అలంకరణలో సోమవారం దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహిళా విభాగం సభ్యులు ఆలయంలో సామూహిక లలితా పారాయణం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. బూదిగుమ్మ పద్మావతి వెంకటరమణస్వామి ఆలయంలో అమ్మవారు లలితాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. తగ్గపర్తిలోని తగ్గుపర్తమ్మ అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలోనూ, విరుపాక్షేశ్వర బ్రహ్మంగారి మఠంలో పోలేరమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో, బెళుగుప్పలో పెద్దమ్మదేవత అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వజ్రకరూరు: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, రుద్రాభిషేకం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర పూజలు చేశారు. జరుట్లరాంపురంలోని జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో దేవీనవరాత్రుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలకు ఉదయం, సాయంత్రం భక్తులు భారీ సంఖ్యలో తరలిచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఐదోరోజు సోమవారం పట్టణంలోని కోటలో వెలసిన నగరేశ్వరి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత సంతానలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఓబుళాచారి రోడ్డులోని బన్ని మహంకాళమ్మ ఆలయం, శాంతినగర్‌లోని పెద్ద బన్ని మహంకాళి, హటకేశ్వరస్వామి ఆలయంలో స్కందమాతగా పార్వతీదేవి, కోటలోని కాళికాంబ దేవి, నేసేపేటలోని చౌడేశ్వరీదేవి, లక్ష్మీబజార్‌లోని శ్రీముదుగులమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బొమ్మక్కపల్లి గ్రామంలో వెలసిన రాజరాజేశ్వరీదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారు బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కణేకల్లు: కణేకల్లులోని దుర్గాదేవీ ఆలయంలో సోమవారం అమ్మవారు అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కనకదుర్గ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు సోమవారం దర్శనం ఇచ్చారు. పట్టణంలోని మారెంపల్లి కాలనీలో మహచండీ అలంకారంలో దర్శనం ఇచ్చారు.

వైభవంగా చండీహోమం



లలితా త్రిపుర సుందరీదేవి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: స్థానిక లలితా త్రిపుర సుందరీదేవి ఆలయంలో సోమవారం అమ్మవారి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, కుంకుమార్చన, అర్చనలు, రుద్రహోమం, గణపతిపూజ, నవగ్రహపూజ, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. అనంతరం అన్న వితరణ చేశారు.



ఉరవకొండలో జగదీశ్వరి అమ్మవారు



ఉరవకొండలో ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారు



బెళుగుప్పలో ధనలక్ష్మీ దేవి అలంకరణలో వాసవీమాత



కణేకల్లులో అన్నపూర్ణ దేవి అవతారంలో అమ్మవారు



కళ్యాణదుర్గంలో బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణ



గుమ్మఘట్టలో భద్రకాళీదేవి అలంకరణ



రాయదుర్గంలో సంతానలక్ష్మీ అలంకరణలో అమ్మవారు



మహాచండీరూపంలో బొమ్మక్కపల్లిలో రాజరాజేశ్వరీదేవి

పశువుల దొడ్డి కాదు.. ప్రధాన రహదారి

రాయదుర్గం: పట్టణంలోని అనంతపురం, కణేకల్లు, బళ్లారి, బీటీపీ ప్రధాన రహదారిపై పశువుల సంచారం ఎక్కువైంది. గుంపులు గుంపులుగా రోడ్డుపైకి చేరి వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రోడ్లపైనే పోట్లాడుతూ వాహనాలకు అడ్డుగా వస్తుండడంతో ప్రమాదలు జరుగుతున్నాయి. ఇటీవల వృద్ధ దంపతులు కిందపడి గాయాల పాలయ్యారు. ఇలాంటి ఘటనలు పట్టణంలోని రహదారులపై రోజుకో చోట వెలుగుచూస్తున్నాయి. మున్సిపల్ అధికారులు హడావుడి చేసి ఆ తర్వాత వదిలేస్తున్నారు. పశువులు రోడ్లపై వదిలిన యజమానులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. పశు యజమానులకు నోటీసులు జారీ చేస్తామన్నారు.



కణేకల్లు రోడ్డుపై పశువుల సంచారం ఇలా..

సువార్త ఉజ్జీవ మహాసభలు ప్రారంభం



ఆధ్యాత్మిక సందేశాన్నిస్తున్న జోయెల్ ఎన్.బాబు

కంబదూరు: మండల కేంద్రంలోని సీఅండ్‌బీజీ మిషన్ చర్చిలో సోమవారం రాత్రి సువార్త ఉజ్జీవ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సభలు రెండు రోజుల పాటు జరగనున్నాయి.ఈ సభలకు ప్రసంగీకులుగా బెంగళూరుకు చెందిన దైవ జనులు జోయెల్ ఎన్.బాబు క్రైస్తవ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన బైబిల్‌లోని ఆధ్యాత్మిక సందేశాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జేమ్స్, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

రాజుకున్న ఫ్లెక్సీ వివాదం

రాయదుర్గం: పట్టణంలో టీడీపీ, బీజేపీ కూటమి నేతల మధ్య సోమవారం ఫ్లెక్సీ వివాదం తలెత్తింది. ఇటీవల బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన ఐరన్ హోర్డింగ్‌కు బీజేపీ నాయకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దాన్ని టీడీపీ నాయకులు కొందరు తొలగించి విజయదశమి శుభాకాంక్షల పేరుతో మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీంతో కూటమి నేతల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

గుమ్మఘట్ట: భూపసముద్రం సమీపంలోని వేదావతి హగరి నుంచి ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ నేత్రపల్లి క్రాస్ వద్ద సోమవారం బోల్తాపడింది. కాగా టీడీపీ నాయకులు అక్రమంగా ఇసుక తరలిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారని, పోలీసులు వారికి సహకరిస్తుండడంతో జోరుగా ఇసుక రవాణా చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

కుందుర్పి: మండలంలోని మలయనూరు, బెస్తరపల్లి, ఎర్రగుంట పంచాయతీల్లో దాడులు చేసి, ఇద్దరు మట్కా బీటర్లను అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ రాంభూపాల్ సోమవారం తెలిపారు. వారి నుంచి రూ.4వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బొమ్మల కొలువు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటవీధిలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని జంబుకేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణశర్మ, శైలజ దంపతుల ఇంట్లో ఏర్పాటైన దసరా బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంటోంది. దాదాపు 500లకుపైగా బొమ్మలతో కొలువును ఏర్పాటు చేశారు. బొమ్మలకొలువు దసరా నవరాత్రి వేడుకలు ముగిసే వరకు ఉంటుందని రామకృష్ణ శర్మ తెలిపారు.

అక్రమంగా గోళ్ల వాటర్‌షెడ్ కమిటీ తొలగింపు!

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గోళ్ల గ్రామంలో అధికార పార్టీ నాయకులు వాటర్‌షెడ్ కమిటీని తొలగించినట్లు వాట్సాప్ గ్రూప్‌ల్లో వైరల్ అవుతోంది. వాటర్‌షెడ్ చైర్మన్, కమిటీని ఎన్నుకోవాలంటే ముందుగా ప్రజలకు తెలియజేసి, వారి అనుమతితో ఎన్నుకోవాల్సి ఉంది. కేవలం అధికారం ఉంది కదా అని ఇష్టారాజ్యంగా కమిటీని తొలగించి, నూతనంగా కమిటీని ఎన్నుకోవడం సరికాదని ప్రజలు చర్చించుకుంటున్నారు. గోళ్ల గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం వాటర్‌షెడ్ పథకం కింద 2021–2022 సంవత్సరంలో రూ.6.36 కోట్లు మంజూరయ్యింది. గ్రామంలో అప్పటి అధికార వైఎస్సార్‌సీపీ నాయకులు వాటర్‌షెడ్ కమిటీని ప్రజల సమక్షంలో ఎంపిక చేశారు. వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్‌గా సర్వోత్తం, వైస్ చైర్మన్‌గా అనిత, మరో 8 మంది కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. అయితే అప్పట్లో గ్రామంలో అభివృద్ధి జరగకుండా సర్పంచు (టీడీపీ మద్దతుదారు) కవిత కమిటీని వ్యతిరేకించారు. సోమవారం ఎలాంటి ఉత్తర్వులు, సమాచారం లేకుండా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గోళ్ల వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్‌గా సర్పంచ్ భర్త బొజ్జన్నను ఎన్నుకున్నట్లు వాట్సాప్ గ్రూప్‌ల్లో వైరల్ అవుతోంది. ఇదంతా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సమక్షంలోనే జరగడం గమనార్హం.

వాహన తనిఖీలు

విడపనకల్లు: ఆంధ్ర సరిహద్దులో 42వ జాతీయ రహదారిపై ఎస్ఐ ఖాజాహుస్సేన్ తన పోలీసు సిబ్బందితో సోమవారం తనిఖీలు చేశారు.

గుమ్మఘట్ట ఎంపీడీఓగా రామకృష్ణ



గుమ్మఘట్ట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈయన పెద్దపప్పూరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ స్థానంలో ఉన్న ఎంపీడీఓ నరసింహామూర్తి లేపాక్షికి బదిలీ అయ్యారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలియచేశారు.

డీటీగా విజయలక్ష్మి బాధ్యతలు



గుమ్మఘట్ట: డిప్యూటీ తహసీల్దార్‌గా విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈమె కంబదూరు మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఇక్కడ ఉన్న డీటీ అనిల్ శెట్టూరు మండలానికి బదిలీ అయ్యారు.

బెళుగుప్ప ఎంపీడీఓగా లక్ష్మీనారాయణ బాధ్యతల స్వీకరణ



బెళుగుప్ప: నూతన ఎంపీడీఓగా లక్ష్మీనారాయణ, ఈఓఆర్డీగా నాగేశ్వరశాస్త్రి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ రామచంద్ర కళ్యాణదుర్గానికి బదిలీ అయ్యారు. యాడికి మండల ఎంపీడీఓ లక్ష్మీనారాయణ బెళుగుప్పకు బదిలీపై వచ్చారు. బెళుగుప్ప ఈఓఆర్డీ మాధవరెడ్డి నంబుల పూలకుంటకు బదిలీ అయ్యారు. పెద్దపప్పూరు మండల ఈఓఆర్డీ నాగేశ్వరశాస్త్రి బెళుగుప్పకు బదిలీపై వచ్చారు.

ఈఓఆర్డీగా చంద్రమౌళి

కణేకల్లు: కణేకల్లు ఈఓఆర్డీగా చంద్రమౌళి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఈఓఆర్డీ గూడెన్నను ఉన్నతాధికారులు కంబదూరుకు బదిలీ చేసిన విషయం విదితమే. ఉరవకొండంలో ఈఓఆర్డీగా పని చేస్తున్న చంద్రమౌళిని కణేకల్లుకు బదిలీ చేశారు.

కూడేరు ఏపీఎంగా దేవానంద ఫిలిప్‌సన్

కూడేరు: మండల ఏపీఎంగా దేవానంద ఫిలిప్‌సన్‌ను ఉన్నతాధికారులు నియమించారు. దీంతో ఆయన సోమవారం ఏపీఎంగా బాధ్యతలు చేపట్టారు. సీసీలు, ఇతర కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈయన శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న రాజశేఖర్ పుట్టపర్తికి బదిలీపై వెళ్లారు.

ఈఓఆర్డీగా రాధాకృష్ణ : కూడేరు మండల విస్తరణాధికారి (ఈఓఆర్డీ)గా రాధాకృష్ణ నియమితులయ్యారు. సోమ వారం ఆయన ఈఓఆర్డీగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న లక్ష్మీనరసమ్మ శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు.

కణేకల్లు ఏపీఎంగా ఆంజనేయులు

కణేకల్లు: కణేకల్లు మండల మహిళా సమాఖ్య ఏపీఎంగా ఎం.ఆంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఓ గోవిందప్పను రాయదుర్గానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో బెలుగుప్ప ఏపీఎం ఆంజనేయులును నియమించారు.

ఏపీఎంగా సర్దానప్ప

కుందుర్పి: కుందుర్పి మండల ఉపాధి హామీ పథకం ఏపీఎంగా సర్దానప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం హుసేన్ కళ్యాణదుర్గానికి బదిలీ అయ్యారు. ఏపీఎం సర్దానప్పకు ఉపాధి సిబ్బంది అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఈఓఆర్డీగా బాలాజీ : కుందుర్పి మండల ఈఓఆర్డీగా బాలాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాలాజీని సిబ్బంది అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏఓగా తిప్పయ్య

కంబదూరు: కంబదూరు మండల పరిషత్ కార్యాలయం ఏఓగా తిప్పయ్య నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఆంజనేయులు ఇతర ప్రాంతానికి బదిలీ అయ్యారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో పనిచేస్తున్న తిప్పయ్య ఇక్కడికి బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన ఏఓగా బాధ్యతలు చేపట్టారు. ఈఓపీఆర్డీగా గూడెన్న కణేకల్లు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

అధికారులు గైర్హాజర్

కూడేరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు గైర్హాజరయ్యారు. డీటీ సూర్యప్రతాప్, ఏపీఎం దేవానంద ఫిలిప్‌సన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రాజేశ్వరి, అరుణ మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. అధికారులు లేకపోవడంతో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.